క్లుప్తంగా

పంట క్షేత్రాల సందర్శన

రఘునాథపల్లి: మండలంలోని లక్ష్మీతండా శివారులో కాప్సియన్ సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం వరి పంట క్షేత్ర సందర్శన నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీతండాతో పాటు ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, రామచంద్రగూడెం, మాధారం, సోమయ్యకుంటతండాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో కంపెనీ ఉమ్మడి జిల్లా సేల్స్ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ కాప్సియన్ సీడ్స్ వారి నాయక్ వరి రకం తెగుళ్లను తట్టుకుని మంచి దిగుబడి ఇస్తుందన్నారు. కంపెనీ డిస్ట్రిబ్యూటర్ మోటె నరేష్, రిప్రజెంటివ్ అశోక్, రైతులు పాల్గొన్నారు.

'అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

పాలకుర్తి టౌన్: గిరిజన యువకుడు శ్రీను నాయక్ ఆత్మహత్య కేసులో పాలకుర్తి మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకుడు వీరమనేని యాకాంతరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా డిమాండ్ చేశారు. శుక్రవారం పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకల తండాకు చెందిన లకావత్ శ్రీనునాయక్ కుటుంబాన్ని ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుమ్మడిరాజు సాంబయ్య, రాష్ట్ర కమిటీ రజిత, మల్లయ్య, జీడి సోమయ్య, పోలాస సోమయ్య, కళింగరాజు, సారయ్య, బాబు పాల్గొన్నారు.

నియామకం


పరమేశ్వర్

దేవరుప్పుల: తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోలుకొండకు చెందిన సామల పరమేశ్వర్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు టీసీఐవి(184/2023) రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఆవిర్భావించిన వేదికలో రాష్ట్ర స్థాయి చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని చేనేత కార్మికుల హక్కుల సాధన కోసం అంకితభావంతో పనిచేసి తన పదవికి వన్నెతెస్తామన్నారు.

వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్


ప్రసాద్


స్రవంతి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన చారగొండ్ల ప్రసాద్‌ను వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా, ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారిగా తమ్మి స్రవంతి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా గజ్జి సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ నెల 27న జిల్లా కేంద్రంలో వారు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జిల్లా కమిటీలో చోటు కల్పించడంపై ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చిదార జగదీష్ సంతోషం వ్యక్తం చేశారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



జఫర్‌గఢ్: ఉప్పుగల్లు గ్రామంలో ముదిరాజ్ కులస్తులు శుక్రవారం పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు, యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మొక్కులు చెల్లించుకుని మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ కర్ణాకర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు ఐలయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

జనగామ రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ప్రోగ్రాం అధికారి స్వామి అన్నారు. శుక్రవారం డ్యాప్కో ఆధ్వర్యంలో పట్టణంలోని లేబర్ అడ్డా, జనగామ చౌరస్తాలో ఎయిడ్స్‌పై కళా బృందాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎం స్వప్న, మాధురి, ఐసీటీసీ సెంటర్ కౌన్సిలర్ సతీష్, పద్మ, విజయమోహన్, శ్రీకాంత్, కళాకారులు సందీప్, అర్జున్, కృష్ణంరాజు, రజినీ, చిరంజీవి పాల్గొన్నారు.

మృత్యు నిలయంగా వావిలాల మలుపు

- కారు–టాటా ఏస్ ఢీకొని నలుగురికి గాయాలు

పాలకుర్తి టౌన్: మండలంలోని వావిలాల సబ్‌స్టేషన్ మలుపు మృత్యువుకు నిలయంగా మారింది. రెండు నెలల క్రితం అదే మలుపు వద్ద లారీ బస్సు ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృత్యువాత పడినారు. అదే స్థలంలో డీసీఎం బోల్తాపడి 13 పశువులు మృతి చెందాయి. శుక్రవారం అదే స్థలంలో కారు–టాటా ఏస్ ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రమాదాలను నివారించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- పట్టించుకోని పాలకులు
- రూ.లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు


ముళ్ల చెట్లు పెరిగి శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ పశువైద్యశాల భవనం పాలకుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. నూతన పశువైద్యశాలను ప్రారంభిస్తే ఇప్పగూడెంతో పాటు చుట్టు పక్కల గ్రామాలైన అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం, రంగాయగూడెం, సముద్రాల, తానేదార్‌పల్లి తదితర గ్రామాల రైతులకు ఎంతో అనువుగా ఉంటుంది. అయితే అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేనితనంతో భవనం శిథిలావస్థకు చేరుతుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పగూడెంలో పీఏసీఎస్ గోదాం పక్కన ఉన్న చిన్న భవనంలో ఏళ్ల తరబడిగా పశువైద్యశాలను నిర్వహిస్తున్నారు. భవనం ఇరుకుగా ఉండటంతో పశువైద్యులు, సిబ్బందికి, రైతులకు ఇబ్బందిగా ఉండగా దాదాపు పదేళ్ల క్రితం రూ.12 లక్షల నిధులతో నూతన భవన నిర్మాణం చేశారు. అయితే భవన నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకూ దానిని ప్రారంభించలేదు. దాంతో ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అందులో పందులను ఉంచుతుండగా పందుల కొట్టంగా మారింది. ప్రస్తుత వర్షాకాలంలో భవనం చుట్టూరా, లోపల పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు పెరిగి శిథిలావస్థకు చేరింది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో భవనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి సదరు భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



రఘునాథపల్లి: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



దేవరుప్పుల: ధర్నా చేస్తున్న నాయకులు

రఘునాథపల్లి/జనగామ రూరల్/జఫర్‌గఢ్/స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జనగామ, జఫర్‌గఢ్, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, దేవరుప్పుల మండల కేంద్రాల్లో తహసీల్ ఎదుట ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లతో సంబంధం లేకుండా ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు కళాశాలల యజమాన్యాలు వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. పేదలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించక పోవడం దారుణమన్నారు. నాయకులు, దాసగాని సుమ, పాదల లవకుమార్, కందుకూరి వంశీతేజ, గోదుగు రమేష్, అక్షిత్, కనకరాజు, ఆర్య, రవి, కిరణ్, శ్రీకాంత్, సాంబరాజు, రాహుల్, శ్రీనాథ్, రవి, రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



కొడకండ్ల: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండలకేంద్రానికి చెందిన హోంగార్డు మహ్మద్ గౌస్‌పాషా కుటుంబానికి శుక్రవారం ఆర్థికసాయం అందించి మిత్రబంధాన్ని చాటుకున్నారు. అతని స్నేహితులు, గౌస్‌పాషాతో చదువుకున్న ఉన్నత పాఠశాలకు చెందిన 1992–93 బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా తమ మిత్రుడు మృతితో పెద్ద దిక్కును కోల్పోయి కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నందున తమవంతుగా సాయం అందించాలనే సంకల్పంతో రూ.75వేలు పోగు చేసి అందజేశారు.

ఈరవెన్నులో..



పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన సంపంగి నర్సింహ ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులతోపాటు ఆర్థికసాయం అందజేశారు. బిర్రు సోమేశ్వర్, ముసుకు కేశవరావు, ఏదునూరి మదార్, అనుముల మహేందర్, అనంతుల పురుషోత్తం, తొడుసు మల్లేష్, బిర్రు వెంకటేశ్వర్లు, తొడుసు రాజు, యార రాజు ఉన్నారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన భాస్కుల ఎల్లయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు తాళ్లపల్లి సమ్మయ్య, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, రంగు రమేశ్, గజ్జెల దామోదర్, పాశం సురేష్, హరిబాబు, వెంకటస్వామి, విజయ్ ఉన్నారు.

ఇబ్రహీంపూర్‌లో..


విమల (ఫైల్)

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇంగోళ్ల హెమేందర్ సతీమణి విమల (40) మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం విమల మృతదేహాన్ని సందర్శించి పూల మాలలతో నివాళులర్పించారు. రోదిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాస్, లక్ష్మయ్య, భాస్కర్, నాగరాజు, కార్తిక్, నరేష్, నరేశ్, నాగరాజు, గట్టయ్య, కిరణ్ తదితరులు ఉన్నారు.

గాయపడిన కోతులకు చికిత్స


వెటర్నరీ వైద్యులు, యువకులను అభినందిస్తున్న కాలనీవాసులు, చిత్రంలో చికిత్స పొందిన కోతులు

జనగామ: పోకిరీల రాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లి, పిల్ల కోతులకు సకాలంలో వైద్యం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు పట్టణంలోని గుండ్లగడ్డ వాసులు. శుక్రవారం గుండ్లగడ్డ ఏరియాలో కోతుల గుంపులు వచ్చి హల్‌చేయడంతో కొంత మంది ఆకతాయిలు రాళ్లతో కొడుతూ వెళ్లగొట్టే ప్రయత్నం చేశారు. రాళ్ల దాడిలో తల్లి, పిల్ల కోతులకు తల, నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంట వచ్చిన వానర మూకలు పరారు కాగా, గాయాల పాలైన రెండు కోతులు తల్లడిల్లిపోతూ అక్కడే ఉండిపోయాయి. ఇదే సమయంలో గుండ్లగడ్డకు చెందిన సుంచు శ్రీకాంత్ గమనించి వెంటనే వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. తన సహాయకులు నితిన్‌తో కలిసి డాక్టర్ గుండ్లగడ్డకు చేరుకుని కాలనీలోని యువకులు శ్రీకాంత్, రాజు, మహేష్, ఇమ్రాన్, వంశీ, అఖి, కపిల్ సాయంతో గంట పాటు వైద్యం చేసి తల్లి, పిల్ల కోతిని బతికించారు. నీరసంగా ఉన్న కోతులకు మందులు ఇచ్చి, ఓఆర్ఎస్ తాగించారు. ట్రీట్‌మెంట్ చేసిన తర్వాత కోలుకున్న కోతులు ఎగురుకుంటూ వెళ్లడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కోతులకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, సహాయకులు నితిన్‌ను కాలనీ వాసులు అభినందించారు.

దివ్యాంగులపై వివక్ష చూపొద్దు



జనగామ రూరల్: దివ్యాంగులపై వివక్ష చూపొద్దని తెలంగాణ దివ్యాంగుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల సమ్మయ్య అన్నారు. శుక్రవారం దివ్యాంగుల చట్టం 2016లోని 91,92 సెక్షన్ల ప్రాముఖ్యతపై రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషాతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుటుంబంతో సహా సాటి మనిషిగా దివ్యాంగులను గుర్తించాలన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుమతి, ప్రధాన కార్యదర్శి ఐలేష్, సంపత్, సుధాకర్, మల్లేష్, స్వరూప, సత్తిరెడి పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, సామాజిక న్యాయం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అహర్నిశలు కృషి చేస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ అన్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్‌మెంట్‌లో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలల్లోని పలు పాఠశాలలను యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈసారి కూడా సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని రాష్ట్ర యూటీఎఫ్ బలపరుస్తూ పోటీలో నిలిపిందన్నారు. నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలన్నారు. మంగు జయప్రకాష్, శేషభట్టర్ వెంకటరమణ, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


జనగామ: సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందిస్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జనగామ టౌన్, మండలం, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాలకు చెందిన 70మంది లబ్ధిదారులకు రూ.22,48,500 సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేసుకున్న సమయంలో, బిల్లులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు మండలాల పర్యటన సమయంలో తాను వచ్చే క్రమంలో ఇవ్వొచ్చన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులో చేసే ఖర్చులో ప్రభుత్వం నుంచి కొంత మొత్తంలో వచ్చే సాయాన్ని త్వరతగతిన తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అలాగే అసెంబ్లీ ఎనిన్కల సమయంలో తాను ఇచ్చిన హామీ మేరకు సొంత దవాఖాన నీలిమ హాస్పిటల్‌లో నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్యం కొనసాగుతుందన్నారు. నీలిమా దవాఖానకు ప్రతి రోజు 350 మంది పేషెంట్లు వస్తు న్నారని,ప్రతి ఒక్కరికి పరీక్షలు చేసి, అవసరమైన మందులను సైతం ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమునలింగయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాడిపెల్లి ప్రేమలతా రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, నాయకులు ఇర్రి రమణారెడ్డి, బాల్దె సిద్దిలింగం, కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, అనిత, పేర్ని స్వరూప, కో ఆప్షన్ సభ్యుడు మసీఉర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రతిపక్ష పార్టీలను విమర్శిస్తోందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం వద్ద షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే.. 42 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆడపడుచుల వివాహానికి రూ.లక్షతో పాటు తులం బంగారాన్ని ఇస్తామని ఇప్పటి వరకూ అమలు చేయడం లేదని విమర్శించారు.

లబ్ధిదారులకు ఇబ్బంది కలిగించొద్దు

కళ్యాణలక్ష్మి చెక్కుల తీసుకునేందుకు తహసీల్‌కు వచ్చిన లబ్ధిదారులను రెవెన్యూ అధికారులు ఎందుకు ఇబ్బంది పెట్టారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తహసీల్దార్ మహిపాల్‌రెడ్డిని నిలదీశారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రావడం లేదని లబ్ధిదారులతో చెక్కుల పత్రాలపై సంతకాలను తీసుకుని వెళ్లిపొమ్మనడమేంటని, అసలు ప్రొటోకాల్ అంటే ఏమిటో తెలుసా.. అధికారులు కూడా అధికారపార్టీకే భజన చేయండి అని అన్నారు. ఈ విషయాన్ని పైఅధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఇకపై లబ్ధిదారులను ఇబ్బందికి గురిచేయొద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, వైస్ చైర్మన్ మద్దికుంట రాధ, నాయకులు ఇర్రి రమణారెడ్డి, చెంద్రారెడ్డి, కృష్ణంరాజు, అనిల్‌రెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, బాల్నె సిద్దిలింగం, షబ్బీర్, సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలమల్లు, అశోక్, రాజు, తిరుపతి, భాస్కర్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి


మాట్లాడుతున్న రవీందర్

జనగామ రూరల్: కార్మికుల సంక్షేమం, హక్కుల సాధన కోసం పోరాటం చేసేది మజ్దూర్ యూనియన్ మాత్రమే అని యూనియన్ డివిజన్ సెక్రటరీ రవీందర్ అన్నారు. శుక్రవారం రైల్వే గుర్తింపు ఎన్నికల్లో భాగంగా వంగపల్లి నుంచి చేపట్టిన ప్రచారం జనగామకు చేరుకుంది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. కార్మికులకు ఏ సమస్యలు వచ్చినా యూనియన్ పరిష్కారానికి కృషి చేస్తూ ముందుకు పోతుందన్నారు. వచ్చే గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. ఆలేరు బ్రాంచ్ చైర్మన్ తిరుపతిరావు, దేవరాజు, ఏలేందర్, శ్రీశైలం, తిరుపతి, స్వర్ణలత, సుధాకర్, కిరణ్, భాస్కర్, నరేష్, రమేశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి


పాలకుర్తి టౌన్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని ముత్తారం, తీగారం, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ బోనగిరి శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమారస్వామి, ఏపీఎం నరేందర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, భాస్కర్, రంగయ్య, సీసీలు, సీఏలు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనకే ప్రజాపాలన

దేవరుప్పుల: దళారీ వ్యవస్థ నిర్మూలన ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మున్పహాడ్, లాకావత్, దేవునిగుట్టతండాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో 35 మందికి రూ.10.85 లక్షలు, మండల పరిషత్‌లో 26 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. నల్ల శ్రీరాములు, విజయడెయిరీ పాలకవర్గ జిల్లా అధ్యక్షుడు ధర్మారెడ్డి, డీఆర్‌డీఏ అదనపు పీడీ శ్రీనివాస్, నాన్ ఫామ్ డీపీఏ కవిత, తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, చందన సమాఖ్య అధ్యక్షురాలు ఉమ, సురేష్‌బాబు, శ్రీనివాస్, భాగ్యనాయక్, శ్రీను పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

కొడకండ్ల: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మొండ్రాయి, నర్సింగాపురం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మండలకేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకై కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్‌ను కూడా ప్రభుత్వం అందిస్తూ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకొన్నందున ప్రభుత్వ సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ కోల చంద్రమోహన్, ఏపీఎం సత్యనారాయణ, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీల అమలులో విఫలం'

చిల్పూరు: ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలులో విఫలం అయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆది సాయన్న అన్నారు. మండల కేంద్రంలోని యారే వృద్ధ సేవాశ్రమంలో సారంపల్లి రిబ్కారాధ అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఎలాంటి శరతులు లేకుండా రూ. 2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. కుమారస్వామి, రాజ్‌కుమార్, వెంకటయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారికి గుర్తింపు లేదు'

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి కష్టపడి పనిచేసిన వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదని పార్టీ మండల ఉపాధ్యక్షుడు గట్టు కోటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో నామినేటెడ్ పోస్టుల్లో, ఇందిరమ్మ కమిటీల్లో పాత కాంగ్రెస్ వారిని గుర్తించడం లేదని, కాంగ్రెస్ పార్టీలోకి ఇటీవల వచ్చిన వారికి అవకాశం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం స్పందించి ఘన్‌పూర్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

జఫర్‌గఢ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి(జి) నుంచి మండల కేంద్రంలోని తహసీల్ వరకు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పాదయాత్రను నిర్వహించి కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినానాదాలు చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శంకరయ్యకు అందజేశారు. ఎండి షబానా, మండల నాయకులు కాట సుధాకర్, గుండెబోయిన రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జనగామ రూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రజిని సూచించారు. మండలంలోని పసరమడ్ల పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించి జ్వరం వచ్చిన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ లచ్చిరాం, ఫార్మసిస్టు జి.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం గ్రామశాఖ కార్యదర్శిగా నర్సయ్య

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన మీసరగండ్ల నర్సయ్య సీపీఎం గ్రామశాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పార్టీ కార్యకర్తలు గ్రామంలో సమావేశమై నర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వేలం వాయిదా

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి(అభిషేకం, వావాన పూజ సామగ్రి మినహాయించి) తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే లైసెన్స్ కోసం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం శుక్రవారం హైదరాబాద్‌లో ఆర్‌జేసీ, దేవాదాయ ధర్మదాయశాఖ కార్యాలంలో నిర్వహించగా సరైన పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు ప్రకటనలో తెలిపారు. తిరిగి సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని ఈఓ తెలిపారు.

రిజర్వేషన్లపై బహిరంగ విచారణ

తరిగొప్పుల/బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో సూచనలు, సలహాలు కోరుతూ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగా విచారణ కార్యక్రమం నిర్వహిస్తోందని తహసీల్దార్ నాగేశ్వరచారి, బచ్చన్నపేట మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ప్రకటనలో వేర్వేరుగా తెలిపారు. నవంబర్ 2వ తేదీన హనుమకొండ కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

జయప్రదం చేయండి

దేవరుప్పుల: మేకలతండా వాసి లకావత్ శ్రీను ఆత్మహత్య ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు నేడు(శనివారం) ఉదయం 11 గంటలకు పాలకుర్తిలో తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రామ్‌సింగ్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన పేరిట అణిచివేతకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండను ఎండగట్టేందుకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రేపు ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గ ప్రమాణస్వీకారం

స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 27న జిల్లా కేంద్రంలోని ఉషోదయ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ను నర్సింహులుగుప్తా తెలిపారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఆర్యవైశ్యమహాసభ నూతన కమిటీలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలానికి సముచిత స్థానం కల్పించారన్నారు. కమిటీలో ఘన్‌పూర్ మండలానికి పెద్దపీట వేయడం సంతోషంగా ఉందన్నారు. 27న నిర్వహించే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ వరంగల్‌లో నేడు (శనివారం) నిర్వహించనున్న మాదిగల ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రడపాక అదాం పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ధర్మయుద్ధ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రవీందర్, మహేందర్, నవీన్, యాకనాథం పాల్గొన్నారు.